టీపీసీసీ అధ్యక్షుడికి ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు



మహేష్‌కుమార్‌గౌడ్

బర్కత్‌పుర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు-2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. జాతీయ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఐక్యతకు, అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీగా ఎదగడం బీసీ వర్గానికి గర్వకారణం అని అన్నారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం, శాంతిస్థాపనకు ప్రజల్లో ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టి అందర్నీ ఒకే తాటిపై నడిపిస్తూ ముందుకు సాగుతున్నందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ అవార్డును బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు. శాలువా, జ్ఞాపిక, పూలమాలతో సోమవారం నార్సింగిలోని తన నివాసంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



కమలానగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కమలానగర్‌లో పర్యటించిన బీజేపీ నేత చింతల

గోల్నాక, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ కమలానగర్ మూసీ పరీవాహక బస్తీలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించి ప్రజలను కలుసుకుని వారి బాధలు విన్నారు. 'మీరెవ్వరూ అధైర్యపడవద్దు. మీ ఇళ్లను కూల్చకుండా బీజేపీ మీకు అండగా నిలబడి పోరాడుతుంది' అని ఆయన భరోసా ఇచ్చారు. మూసీనిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి గోల్నాక డివిజన్ కమలానగర్‌లో బస్తీ నిద్ర చేసిన రామచంద్రారెడ్డి ఆదివారం బస్తీలో పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఏడెల్లి అజయ్‌కుమార్, చుక్క జగన్, కె.రాంచందర్, సింగీతం రాజేష్, బి.ఈశ్వర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ - 2024 విజేతలను ప్రకటిస్తున్న పులగం రాంచంద్రారెడ్డి, జాలాద్రి విజయ తదితరులు

విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ - 2024 విజేతల వెల్లడి

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ - 2024లో భాగంగా పోటీలో పాల్గొన్న చిత్రాల విజేతలను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంస్థ ప్రధానకార్యదర్శి పులగం రాంచంద్రారెడ్డి, న్యాయనిర్ణేత జాలాద్రి విజయ ప్రకటించారు. ఉత్తమ చిత్రం సహస్ర (దర్శకుడు సాయిసృజన్ పెళ్లూరి), ఉత్తమ స్క్రీన్‌ప్లే తనికెళ్ల భరణి (చిత్రం డెడ్ ఎండ్), ఉత్తమ దర్శకుడు కె.శివతేజ (క్యాసెరాసెర), ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం పొట్టి శ్రీరాములు (నిర్మాత మద్దాళి రఘురామ్), ఉత్తమ నటుడు బీడీఎల్.సత్యనారాయణ (చిత్రం సాగరవాసి), ఉత్తమ సహాయ నటి విజయదుర్గ (కొత్త జీవితం)లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎస్‌వీకే కార్యదర్శి వినయ్ కుమార్, బీడీఎల్.సత్యనారాయణ, జాలాద్రి విజయ, విజయదుర్గ, పీవీ.చలం, దిలీప్ ఎకుమార్, కపిల్ జోన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, వినోద్‌కుమార్ తెలిపారు. తిలక్‌నగర్, గోల్నాక, క్షత్రియ, ఏపీఎస్‌ఈబీ ఈఏ, జగదాంబ నర్సింగ్‌హోమ్ 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి1, ప్లేగ్రౌండ్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి 3.30 గంటల వరకు, దిల్‌కుష, జవహర్ నగర్ పరిధిలో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రెడ్‌బిల్డింగ్ పరిధిలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆకట్టుకున్న స్వరాభిషేకం



సుధాకర్‌ను సన్మానిస్తున్న త్రినాథరావు

చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుధాకర్ స్వరాభిషేకం-6 కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకుడు సుధాకర్ సమర్పణలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్ కళాభారతి కల్చరల్ స్టూడియోలో జరిగిన గాన విభావరిలో భాగంగా ఆయనతోపాటు కార్తీక్, రాగరేఖ, వై.అపర్ణ తదితరులు పలు సినీ, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు గాయకుడు సుధాకర్‌ను సన్మానించారు.



మాట్లాడుతున్న మాలమహానాడు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

30న మాలమహానాడు రాష్ట్ర సదస్సు

కవాడిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 30న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సదస్సును విజయవంతం చేయాలని సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మాలమహానాడు కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు కోసం ఇప్పటికే ఆర్‌టీడీ హైకోర్టు జడ్జి షమీర్‌అక్తర్ ఏక సభ్య కమిషన్‌ను నియమించి ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. మాల, మాల ఉపకులాలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాన కారణం మాలల ఓట్లేనని అన్నారు. మాల ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జేఎస్.రావు, జాతీయ ఉపాధ్యక్షులు జొన్నల గడ్డ భాస్కర్‌రావు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు

● నేటి నుంచి అంబర్‌పేటలో .. ● 21న ఒడిబియ్యం, బోనాల సమర్పణ ● శతాబ్దాల చరిత్ర.. వంతెన నిర్మాణంతో మార్పు



ప్రతిష్ఠాపన చేయనున్న బొడ్రాయి నమూనా

అంబర్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో బొడ్రాయి పండుగ (నాభిశిల) పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. ఆదివారం పాత బొడ్రాయిని తొలగించారు. నేడు మొదలయ్యే పునఃప్రతిష్ఠ ఉత్సవాలు 20వ తేదీ మధ్యాహ్నం వరకు జరుగుతాయని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ముఖ్య సలహాదారు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. 18న గోపూజతో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. 20న మధ్యాహ్నం నుంచి మరునాడు ఉదయం వరకు బైండ్ల పూజారుల పూజలుంటాయని పేర్కొన్నారు. అంబర్‌పేట ప్రధాన రహదారిలోని గాంధీబొమ్మ ఎదురుగా ఉన్న స్థలంలో కార్యక్రమం జరుగనుంది. ప్రతిష్ఠాపన అనంతరం భక్తులు కొత్త కుండ, నూతన ఇత్తడి బిందెలు, రాగి చెంబులతో జలాభిషేకం చేయాలని సూచించారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఇంటి వద్ద ఒడిబియ్యం కార్యక్రమం ముగించుకొని బొడ్రాయికి ఒడిబియ్యం, బోనం సమర్పించాలన్నారు. ఈ ఉత్సవాలకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రి కృష్ణాయాదవ్ తదితరులు హాజరవుతారని చెప్పారు.

ఇదీ చరిత్ర...

హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై గాంధీ బొమ్మ వద్ద అంబర్‌పేటగా గ్రామ బొడ్రాయిని శతాబ్దాల క్రితం భూమికి నాలుగైదు అడుగుల లోతులో ఏర్పాటు చేశారు. లోపలికి దిగి పూజలు చేయడం ఇబ్బందికరంగా మారడంతో గతంలోనే స్థిరమైన ఆకారంతో బొడ్రాయిని పైన ఏర్పాటు చేశారు. బోనాల ఉత్సవాలు, ఇతర పండుగల సమయంలో భక్తులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రధాన రహదారి కావడంతో నిర్మాణం, కార్పెటింగ్‌తో రోడ్డు ఎత్తు పెరిగింది. దీంతో బొడ్రాయి ఎత్తు తగ్గింది. అంబర్‌పేట చే నెంబర్ వంతెన నిర్మాణం బొడ్రాయి మీదుగా జరిగింది. శాస్త్రం ప్రకారం బొడ్రాయి ఓపెన్‌గా ఉండాలి. సూర్యకిరణాలు, వర్షం పడాలి. ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఆ పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పునఃప్రతిష్ఠాపనకు స్థానికపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. గాంధీ బొమ్మ ఎదురుగా ఉన్న స్థలంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన చేయనున్నారు. మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన సేవా సమితి పేర్కొంది.

కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు కుట్ర

● బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అరెస్ట్ చేసేందుకు కుట్ర చేస్తున్నారని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆరోపించారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌కు ప్రజాభిమానం రోజురోజుకూ పెరిగిపోతుండడంతో వారిని రాజకీయంగా దెబ్బతీసేందుకు తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. డ్రగ్స్ పార్టీ, ఫార్మారేస్ పేరిట పలు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. పేదల భూములను లాక్కుని సీఎం రేవంత్‌రెడ్డి అల్లుడికి సంబంధించిన ఫార్మాసిటీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపే కుట్ర జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్, ముషీరాబాద్, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్ల అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్ రెడ్డి, రాకేష్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు ఆకుల అరుణ్‌కుమార్, దీన్‌దయాల్‌రెడ్డి, పి.శ్రీధర్‌చారి, వీరేష్, ఏయిర్‌టెల్ రాజు, వంగర నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీహెచ్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా: కార్పొరేటర్



కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌బీహెచ్ కాలనీవాసులు

చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని రెసిడెంట్స్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఎస్‌బీహెచ్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్‌బీహెచ్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు విశ్వనాథ్, విఠల్, రవీందర్, మనోహర్, వెంకటేశం తదితరులు కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్‌తో కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో నూతన వీడీసీసీరోడ్డును నిర్మించాలని కోరారు. వెలగని వీధిదీపాలకు కొత్త బల్బులు అమర్చాలని, కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కు నిర్వహణలోపం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందన్నారు. యువకులు, గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట మద్యం సేవించి కాలనీలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంటనే తగిన చర్యలు చేపట్టి క్రమంగా కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆకుల సురేందర్, సురేష్, సాయికుమార్, రవియాదవ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్

టీడీపీ ప్రజలకు బాసటగా నిలుస్తుంది

పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారం ఉన్నా లేకపోయినా ఎల్లప్పుడూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ ప్రజలకు బాసటగా నిలుస్తుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాలన పట్ల అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్ రాంకోఠి చౌరస్తాలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నల్లెల కిషోర్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ టీడీపీ నిస్వార్థమైన కార్యకర్తలే నిజమైన బలం అని అన్నారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వ నమోదులో హిమాయత్‌నగర్ డివిజన్ ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేస్తామని నల్లెల కిషోర్ అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పలుస బాల్‌రాజ్‌గౌడ్, పద్మజకిషోర్, నాయకులు బాలాజీ గోస్వామి, వంశీకృష్ణ, ఎం.నర్సింహ, విజయరాపర్తి, మీర్ ఆష్పాక్. కె.భాను, శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యానగర్‌లో మహా నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో భగవాన్ శ్రీసత్యసాయి బాబా వేడుకలు

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబా జన్మదిన వేడుకలు విద్యానగర్‌లోని శివం ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు వారంరోజుల పాటు జరుగనున్నాయి. మహానగర సంకీర్తనలో 17 పల్లకీలు 30కి పైగా స్కూటర్ ర్యాలీ సాయి యువత ఊరేగింపుగా న్యూనల్లకుంట, అంబర్‌పేట పురవీధుల్లో భజనలతో ప్రజలను పులకింపజేశారు. నగరంలోని 16 సత్యసాయి సేవా సంస్థలు నారాయణ్ సేవలను నిర్వహించారు. సాయంత్రం వేదం భజనలతో పాటు బాల వికాస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కోమల్ కపూర్ హాజరయ్యారు. మహిళల ఒకేషనల్ ట్రైనింగ్‌లో తయారు చేసిన బ్యాగ్స్, పర్సులు వంటి పలు వస్తువుల ప్రదర్శనను ప్రారంభించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీసత్యసాయి ప్రతినిధులు ఎమ్మెల్యే కు శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏ.మల్లేశ్వరరావు, శ్రీసత్యసాయి, సత్యసాయి విద్యా విహార్ కన్వీనర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను సత్కరిస్తున్న శివం ప్రతినిధులు

అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాలి

మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు



'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు తదితరులు



మాట్లాడుతున్న జయరాజ్

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాలని, అందుకు తాను వారధిగా పనిచేస్తానని మాజీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కాకి మాధవరావు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీవీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు బొజ్జ భిక్షమయ్య రచించిన బుద్ధుడి నుంచి గద్దర్ వరకు, ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన అస్పృశ్య యోధుడు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు, అంబేడ్కరిస్టుల మధ్య అంతరం ఏర్పడిందని, ఆ అంతరాలను పూడ్చడానికి తాను పదవీ విరమణ చేసిన నాటి నుంచి ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా బీఎల్ఎఫ్ ఏర్పడిందని, అయితే అనుకున్న ఫలితాలు రాలేదన్నారు. లాల్ నీల్ ఐక్యత కోసం 'నేను ఒక వారధి నిర్మించాలని భావిస్తున్నా. దానికి మొదటి ఇటుక నేనే వేస్తా' అని అన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు మాట్లాడుతూ బుద్ధుడు నుంచి గద్దర్ వరకు మహనీయుల చరిత్రను తీసుకురావడం గొప్ప పరిణామం అన్నారు. ఇలాంటి పుస్తకం రాసిన భిక్షమయ్య ధన్యజీవుడు అని అన్నారు. ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ మహనీయుల అంశాలతో కూడిన రచనలు వెలువరించడం అభినందనీయమన్నారు. రచయితలు మహనీయులతో కూడిన మరిన్ని రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రామిక, డాక్టర్ సాత్విక, డాక్టర్ ఆర్తి కిరణ్, హిమజ్వాలా, మమత, కల్యాణ్, చంద్రకిరణ్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. డాక్టర్ పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేసీపీ ప్రాజెక్ట్ సీఎండీ కె.అనిల్‌కుమార్, డాక్టర్ శివ భాగ్యరావు, టీపీఎస్కే కన్వీనర్ జి.రాములు, ఎస్.వినయ్‌కుమార్, రేఖ చంద్రశేఖర్‌రావు, ట్రస్ట్ ప్రతినిధులు బొజ్జ రవికిరణ్, బొజ్జ క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

పేదలు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలి : ఎమ్మెల్యే

చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యఖర్చులు భరించలేని అర్హులైన పేదవారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు సుమారు రూ.3.66 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గాంధీనగర్, రామ్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు ముడారపు రాకేష్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న సత్యనారాయణ, ముదిగొండ మురళి, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఎస్టీ ప్రేమ్, సంతోష్ పాల్గొన్నారు.

బంగారు పోచమ్మ అమ్మవారికి ఆభరణాల సమర్పణ

చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ సిద్దంశెట్టి అపార్ట్‌మెంట్స్ ఆవరణలో ఉన్న బంగారు పోచమ్మ దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ అమ్మవారికి ఆభరణాలను సమర్పించారు. అనంతరం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ యువ నేత ముఠా జైసింహ, సీనియర్ నాయకులు ముఠా నరేష్, డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, సిద్దంశెట్టి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, మూర్తి, జితేందర్, లక్ష్మి, మణి, పద్మ, ప్రసన్న పాల్గొన్నారు.



హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ, వీరయ్య తదితరులు

పేదలకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం చేస్తున్న సేవలు అభినందనీయమని వాకర్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పేదలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి కె.వీరయ్య, ఇరిగేషన్ శాఖ మాజీ అధికారి భవానీశంకర్, వాకర్స్ క్లబ్ సభ్యులు రాజశేఖర్, ఫోరం ప్రతినిధులు సైదులు, మోహన్‌నాయుడు, శ్రీనివాస్‌రాజ్, నాగేష్, హస్మిత, సంగీత, శ్వేత, లలిత, రాజమౌళి, సుకుమార్, గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

వెరికోస్ వెయిన్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డా.అజయ్ బీ మోసూర్


చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాళ్ల వెనుక భాగంలో ఉబ్బిన రక్తనాళాల (వెరికోస్ వెయిన్స్)ను నిర్లక్ష్యం చేయొద్దని వాస్కులర్ సర్జన్, డయాబెటిక్ ఫుట్ స్పెషలిస్ట్ డా.అజయ్ బీ.మోసూర్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌లోని కేఎం క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. శిబిరాన్ని ప్రారంభించిన డా.అజయ్ బీ మోసూర్ మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్‌కు లేజర్ చికిత్స, అత్యాధునిక గ్లూ థెరపీ అందుబాటులో ఉందన్నారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు డా.కేఎల్ జానకి తదితరులు పాల్గొన్నారు.



పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో పద్మశాలీ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న సుధేశ్‌కుమార్ తదితరులు

పద్మశాలీల సభ్యత్వ నమోదు చేయాలి

రాంనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పద్మశాలీ సభ్యత్వం అత్యధిక స్థాయిలో నిర్వహించాలని నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు అతినగరం సుధేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పద్మశాలీ సభ్యత్వంపై సంఘం నాయకులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు మంథని దశరథ్, బొద్దు తిరుపతి, బోనం ఊర్మిళ, బోడనిర్మల, అంజనేయులు, శేరిపల్లి గణేష్, ఎం.రూపేందర్, బొమ్మర్ల సతీష్, నారాయణమూర్తి, బోనం బన్నీ, ఏనుగుల అనిల్, బుజ్జి వెంకటేష్, తుమ్మ శ్రీను, రఘు, లక్ష్మణ్‌నేత, బాలు, మార్గం అమర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తి యాదవ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.రమేష్, ఉద్యోగులు

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకమైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్‌ను లిబర్టీలోని టీటీడీ దేవస్థానంలో ఆదివారం తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.మార్త రమేష్ సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు ఎం.గోపాల్‌యాదవ్, బి.కృష్ణయాదవ్, జూలూరి గౌరీశంకర్, హనుమాన్ కేసరిగౌడ్, ఎంపీఎస్.నికేతన్‌కుమార్ యాదవ్, నోబుల్ సురేష్ యాదవ్, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.